సాక్షి
అనకాపల్లి
శుక్రవారం : 25 ఏప్రిల్ : 2025





అశ్రు నివాళి

విశాఖ విద్య: కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఏయూలో విద్యార్థులు, అధ్యాపకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

న్యూస్‌రీల్

సీఐల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ పరిధిలో 9 మంది సీఐలకు బదిలీలయ్యాయి. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న బెండి వెంకట్రావ్‌ను అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్‌కు, వీఆర్‌లో ఉన్న జి.రామచంద్రరావును సబ్బవరం అర్బన్ పోలీస్ స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న పి.రమణను విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షులకు అభినందనలు



కె.కె.రాజు, గుడివాడ అమర్‌నాథ్‌లను సత్కరిస్తున్న సమన్వయకర్తలు, నేతలు

విశాఖ సిటీ: వైఎస్సార్ సీపీ విశాఖ, అనకాపల్లి జిల్లాల నూతన అధ్యక్షులుగా నియమితులైన కె.కె.రాజు, గుడివాడ అమర్‌నాథ్‌లకు అభినందనలు వెల్లువెత్తాయి. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఇరువురికి నేతలు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయ్‌ప్రసాద్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, కోడిగుడ్ల పూర్ణిమ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం



పోస్టల్ సిబ్బందికి బహుమతులు అందజేస్తున్న చీఫ్ పోస్ట్ మాస్టర్ కె ప్రకాష్

అనకాపల్లి టౌన్: పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీ సర్కిల్ విజయవాడ చీఫ్ పోస్టుమాస్టర్ కె.ప్రకాష్ తెలిపారు. స్థానిక పోస్టాఫీసులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాలు, పార్సిల్ డెలివరీ ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామన్నారు. బీమా విభాగంలో కామన్ సర్వీస్ సెంటర్, ఆన్‌లైన్ డెలివరీ, తదితర సౌకర్యాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచిన తపాలా సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పట్టణ పోస్టల్ సూపరింటెండెంట్ సిహెచ్.శ్రీనివాసరావు, పోస్ట్ మాస్టర్ సిహెచ్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. రొయ్య..

వేటదారులకు దక్కదేమయ్యా..?

రైవాడ జలాశయంలోని మత్స్య సంపదపై ప్రైవేటు వ్యక్తులు పెత్తనం సాగిస్తున్నారు. వేటదారుల పేదరికాన్ని ఆసరాగా చేసుకొని దళారీలు దందా కొనసాగిస్తున్నారు. వేట సాగిస్తే కాని పూట గడవని స్థితిలో ఉన్న వేటదారుల అవసరాలకు, వేట సామగ్రి కొనుగోలుకు కొద్దిపాటి అడ్వాన్స్‌లు ఇచ్చి వారి కష్టాన్ని దోచుకుంటున్నారు. ముఖ్యంగా రిజర్వాయర్‌లో దొరికే రొయ్యలపై పూర్తి పెత్తనం వారిదే.

- రైతు నుంచి కేజీ రొయ్యలు రూ.180 నుంచి రూ.200కు దళారీలు కొనుగోలు చేస్తారు. → వాటిని గ్రేడింగ్ చేసి సాధారణ రకం రూ.350 నుంచి రూ.450 వరకు విక్రయిస్తారు.
- టైగర్ రొయ్యలయితే కేజీకి రూ.600 వరకు దళారులు వసూలు చేస్తారు. → రోజు 200-300 కేజీల రొయ్యలు, 300 కేజీలకు పైబడి చేపలు లభ్యమవుతాయి.



రైవాడ జలాశయంలో రొయ్యలు వేట సాగిస్తున్న వేటదారులు (ఇన్‌సెట్) నాటు పడవలపై వేటసాగిస్తున్న వేటదారులు

‘రైవాడ’ మత్స్య సంపదపై ప్రైవేటు పెత్తనం

- వేటదారుల పేదరికాన్ని ఆసరాగా చేసుకొని దళారీల దందా
- జలాశయంలో రొయ్యలు పెంచుతున్న ప్రైవేటు వ్యక్తి
- రొయ్యలను తమకే విక్రయించాలని వేటదారులకు హుకుం
- తక్కువ ధరలకు కొనుగోలు చేసి వారిని దోచుకుంటున్న వైనం
- కష్టపడి నాటు పడవలపై వేట సాగిస్తున్నా దక్కని ఫలితం
- దళారీల దోపిడీని పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
- జలాశయంపై ఆధారపడి 300కుపైబడి వేటదారుల జీవనం

దేవరాపల్లి:

రైవాడ రిజర్వాయర్‌లో ఏటా మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలు వేస్తారు. అవి పెరిగి పెద్దవయ్యాక జలాశయాన్ని ఆనుకున్న 10 గ్రామాల వేటదారులు వాటిని పట్టుకొని విక్రయించుకుంటారు. వారికి అధికారులు లైసెన్సులు ఇస్తారు. అయితే జలాశయంలో దొరికే రొయ్యలపై మాత్రం దేవరాపల్లికి చెందిన ఓ ప్రైవేటు వ్యక్తి పెత్తనం కొనసాగుతోంది. మత్స్యశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా దర్జాగా రొయ్యలు పెంచుతున్నారు. సదరు రొయ్యలను సైతం తమకే విక్రయించాలని వేటదారులకు హుకుం జారీ చేసి మరీ, తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. తూనికల్లో సైతం దళారీలు వేటదారులను ఘోరంగా మోసగిస్తున్నారు. దళారీల నుంచి తీసుకున్న అడ్వాన్స్‌లు తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తక్కువ ధరకే వారు విక్రయిస్తున్నారు. దీంతో నాటు పడవలపై కష్టపడి వేట సాగిస్తున్న లైసెన్స్ వేటదారులకు చివరకు కష్టమే మిగులుతోంది. వేటదారుల నుంచి అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన రొయ్యలను అధిక ధరలకు విక్రయించి లక్షలాది **రూపాయలు గడిస్తు**న్నారు. రైవాడ ప్రజలకు సైతం **రొయ్యలు దొరకని** పరిస్థితి నెలకొంది. గ్రామంలో వేటదారులు **ఉన్నప్పటికీ దళారీ వ్యాపారి నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. జలాశయంపై ఇంత దోపిడీ జరుగుతున్నా** మత్స్యశాఖ **అధికారులు పట్టించుకోకపో**వడంపై సర్వత్రా **విమర్శలు వినిపిస్తున్నాయి. దళా**రీల నుంచి మామూళ్లు **ముట్టడంతోనే నిర్లక్ష్యంగా** వ్యవహరిస్తున్నారని ఆరోపణలు **గుప్పుమం**టున్నాయి.



రైవాడ జలాశయంలోని నోరూరించే రొయ్యలు

రొయ్యలలో రకాలు...

రైవాడ జలాశయంలో కాల రొయ్య, జన రొయ్య, టైగర్ రకాల రొయ్యలు దొరుకుతాయి. వీటిలో టైగర్ రకం రొయ్యలు అత్యధికంగా 500 గ్రాముల బరువుతో లభిస్తాయి. బహిరంగ మార్కెట్‌లో కేజీ టైగర్ రొయ్యలు రూ.500 నుంచి 600 వరకు ధర పలుకుతుంది.

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో, మళ్లీ వర్షాకాలం సీజన్‌లో సెప్టెంబర్‌లో జలాశయం నిండుగా ఉన్న సమయంలో నెల రోజులు రొయ్యలు లభిస్తాయి. అలాగే శీలావతి, ఎర్రమైలు, బచ్చు తదితర రకాల చేపలు దొరుకుతాయి.

వేటపై ఆధారపడి 300 కుటుంబాలు

జలాశయంలో వేట సాగిస్తూ **సుమారు 300కు** పైబడి వేటదారు కుటుం**బాలు జీవనోపాధి పొం**దుతున్నాయి. అనకాపల్లి జిల్లా**లోని రైవాడ,** బేతపూడి, సాంపురం, పాతబొడ్డపాడు, కొత్తబొడ్డపాడు, లోవముకుందపురం గ్రామాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని జీనబాడు, కొరపర్తి తదితర గ్రామాలకు చెందిన వేటదారులు రొయ్యల వేట సాగిస్తూ జీవనాధారం పొందుతున్నారు. రోజుకు సుమారు 200 నుంచి 300 కేజీల వరకు రొయ్యలు లభిస్తాయి. చేపలు రోజుకు 250 నుంచి 300 కేజీల వరకు దొరుకుతున్నాయి.

‘రైవాడ’ చేపలు, రొయ్యలకు మార్కెట్లో భలే డిమాండ్

రైవాడ జలాశయంలో దొరికే చేపలు, రొయ్యలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది. ఇక్కడి రొయ్యలు, చేపలు రుచికరంగా ఉండటంతో వీటి కోసం ఎగబడి మరీ కొనుగోలు చేస్తారు. జిల్లాలో పలు జలాశయాల్లో చేపలు, రొయ్యలు లభిస్తున్నప్పటికీ రైవాడ జలాశయంలో దొరికే చేపలు, రొయ్యలది రుచిలో ప్రత్యేక స్థానం. ఇక్కడి మట్టి సారవంతమో లేదా నీటి సారమో తెలియదు కాని ఇక్కడి చేపలు, రొయ్యలకు మరేవీ సాటిరావని చేపల ప్రియులు అంటారు. ఆదివారం పూట జలాశయం వద్ద గంటల కొద్దీ నిరీక్షించి మరీ కొనుగోలు చేస్తారు.



మా కష్టాన్ని దోచుకుంటున్నారు



జలాశయంలో ప్రైవేటు వ్యక్తి రొయ్య పిల్లలను నామమాత్రంగా వేసి వేటదారుల కష్టాన్ని దోచుకుంటున్నారు. ఇక్కడ సహజంగా దొరికే రొయ్యలను సైతం తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోజంతా కష్టపడిన వేటదారులకు శ్రమే మిగులుతుంది. చిన్నపాటి పెట్టుబడులు ఇచ్చి వేటదారుల నుంచి తక్కువకు కొనుగోలు చేయడం అత్యంత దారుణం. మత్స్యశాఖ అధికారులు స్పందించాలి.

–కొమర నాగేంద్ర, వేటదారుడు, రైవాడ

మత్స్యశాఖ చొరవ తీసుకోవాలి



ప్రభుత్వం స్పందించి రైవాడ జలాశయంలో రొయ్య పిల్లలను విడుదల చేయాలి. మత్స్యశాఖ అధికార్ల సమక్షంలో చేప పిల్లలు మాదిరిగా రొయ్య పిల్లలను పెంపకం చేపడితే వేటదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇలా చేపడితే ప్రైవేటు వ్యాపారుల చేతిలో మోసపోవాల్సిన పరిస్థితి ఉండదు.

–జంకల రమణ, వేటదారుడు, రైవాడ

ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

రైవాడ జలాశయంపై రొయ్య పిల్లల పెంపకానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా వేస్తే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. వేటదారులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించం.

–ఎస్.కె.జాస్మిన్, ఫిషరీస్ ఏడీ, అనకాపల్లి



లూలూ మాల్‌కు కేటాయించిన భూములు

- రూ.99 పైసలకే ఎకరా

విశాఖలో కారుచౌక



ఉర్సా కంపెనీకి కేటాయించిన భూములు

- ఎకరం 99 పైసలకు టీసీఎస్‌కి కట్టబెట్టిన కూటమి సర్కారు
- అక్కడ ఎకరం రూ.50 కోట్ల పైమాటే..
- ఊరు పేరు లేని ఉర్సా కంపెనీకి 60 ఎకరాల భూ కేటాయింపు
- ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ ధర ప్రకారమే భూములు
- ప్రైవేట్ సంస్థలకు మాత్రం రూపాయికే దోచిపెడుతున్న సర్కారు
- లూలూకి బీచ్ రోడ్డులో రూ.వేల కోట్ల భూముల అప్పగింత

ప్రైవేట్ సంస్థలకు భూముల ధారాదత్తం

కూటమి సర్కారు కన్ను విశ్వనగరి విశాఖపై పడింది. ఊరు పేరు లేని కంపెనీలకు రూ.వేల కోట్ల విలువైన భూములను ధారాదత్తం చేసేస్తోంది. రూ.50 కోట్లు విలువ చేసే ఎకరం భూమిని 99 పైసలకే కట్టబెట్టేసింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు విశాఖ భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేసి రూ.వేల కోట్ల భూ కుంభకోణానికి తెరతీసిన టీడీపీ ప్రభుత్వం.. ఇప్పుడు అధికారదర్పంతో భూముల పందేరానికి తెగబడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ విలువ ప్రకారం భూకేటాయింపులు జరుపుతూ.. ప్రైవేట్ కంపెనీలకు కారుచౌకగా భూములను ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాక్షి, విశాఖపట్నం: అధికార పీఠం ఎక్కింది మొదలు దోచుకోవడం.. పంచుకోవడమే పరమావధిగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం.. విశాఖ భూములను హాంఫట్ స్వాహా చేసేందుకు చకచకాపావులు కదుపుతోంది. 2014–19 మధ్య ప్రభుత్వ రికార్డులను సైతం ట్యాంపరింగ్ చేసిన టీడీపీ నేతలు వేల కోట్ల భూములను ఆక్రమించేసుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.వేల కోట్లు విలువ చేసే భూములను **టీడీపీ భూ బకాసురుల ఆక్ర**మణల చెర నుంచి విడి**పించి ప్రభుత్వ ఆధీనంలోకి** తీసుకొచ్చింది. ప్రస్తుత **కూటమి ప్రభుత్వం అడ్డగోలు**గా భూ కేటాయింపులు **చేస్తూ విశాఖను హోల్** సేల్‌గా అమ్మేస్తోంది. **రూపాయికి ఏమొస్తుందో** తెలియదు కానీ.. వైజాగ్‌లో మాత్రం ఎకరం భూమి అప్పనంగా వచ్చేస్తోందనేది ఇప్పుడు రాష్ట్రమంతటా హాట్‌టాపిక్‌గా మారిపోయింది. టీసీఎస్ కంపెనీకి మధురవాడ ప్రాంతంలో కేవలం 99 పైసలకే ఎకరం చొప్పున 21 ఎకరాలు ధారాదత్తం చేస్తుండటం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది. ప్రైమ్ సిటీగా పేరొందిన రుషికొండ దగ్గర ఐటీ హిల్స్‌లో ఎకరం దాదాపు 50 కోట్లు వరకూ పలుకుతోంది. కానీ చంద్రబాబు ప్రభుత్వం మాత్రం తెర వెనుక బాగోతం నడిపి కేవలం 99 పైసలకే కట్టబెడుతూ ఉత్తర్వులు కూడా జారీ చేసేసింది.

ఉర్సా.. లూలూ.. ఎన్నెన్నో..!

ఊరు పేరు లేని కంపెనీ అప్పుడే పురుడు పోసుకుంది. ఉర్సా పేరుతో తెరపైకి వచ్చిన ఈ కంపెనీకి ఏకంగా 60 ఎకరాలు విశాఖలో ధారాదత్తం చేసేసింది. దీనికి కూడా అడ్డగోలుగా రూపాయికి ఎకరం చొప్పున కట్టబెట్టడంపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2017లో భూములు తీసుకొని ఒక్క ఇటుక కూడా పెట్టకపోవడంతో లూలూకి భూ కేటాయింపుల్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. అదే వేల కోట్ల భూమిని నిబంధనలకు విరుద్ధంగా మళ్లీ లూలూ చేతిలో పెట్టేసింది. ఇలా అడ్డగోలు భూ కేటాయింపులు చూస్తుంటే.. ఇవన్నీ రాజకీయ కేటాయింపులేనన్నది స్పష్టమవుతోంది.

ప్రభుత్వ రంగ సంస్థలకు మార్కెట్ ధరకే..!

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా రిజిస్ట్రేషన్ ధరకు భూములు కేటాయింపులు చేపట్టింది. గతంలో భారత నౌకాదళానికి ఎకరా రూ.కోటి, పోస్టల్‌కు 30 సెంట్లు రూ.కోటి, సీబీఐకి ఎకరా భూమిని రూ.కోటి చొప్పున కేంద్ర ప్రభుత్వ శాఖలకు కేటాయింపులు జరిగాయి. వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్(వీటీపీఎల్)కు ఎకరం రూ.కోటి చొప్పున భూములు కేటాయించింది. 2022లో మధురవాడలో ఎన్‌సీసీ సంస్థకు ఎకరం భూమిని రూ.1.93 కోట్లకు ఇస్తే.. తక్కువ ధరకు అప్పగించేశారంటూ టీడీపీ నేతలు గగ్గోలు పెట్టారు. అదానీ డేటా సెంటర్‌కు కూడా ఎకరం రూ.కోటి చొప్పున కేటాయింపులు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ రంగ సంస్థలైన ఈఎస్ఐ, నేవీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు కూడా నిబంధనల మేరకు మాత్రమే భూములు కేటాయించారు. కానీ కూటమి ప్రభుత్వం కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం భూముల్ని దోచి పెడుతున్నట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, ఉద్యోగాల ముసుగులో పెద్ద ఎత్తున భూదోపిడీతో పాటు భారీగా అవినీతి జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు



టీసీఎస్ కంపెనీకి రుషికొండ ప్రాంతంలో విలువైన భూములను అతి తక్కువ లీజుకు ధారాదత్తం చేయడం ప్రజాప్రయోజనాలకు, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు ముమ్మాటికీ విరుద్ధమే. రుషికొండలో రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం చదరపు గజం రూ.30 వేలు ఉంది. మార్కెట్ ధర అంతకంటే ఎక్కువ ఉంటుంది. రిజిస్ట్రేషన్ విలువ తీసుకున్నా 21.16 ఎకరాల భూమి రూ.320 కోట్లు మించి ఉంటుంది. అటువంటి భూమిని కేవలం ఏడాదికి 99 పైసలకు ఇవ్వడం హాస్యాస్పదం. రాష్ట్ర ప్రభుత్వం 2012లో జారీ చేసిన జీవో నెంబర్ 571 ప్రకారం ప్రభుత్వ భూములను మార్కెట్ విలువ మీద 10 శాతం కంటే తక్కువకు ప్రైవేట్ సంస్థలకు వార్షిక లీజుల కింద ఇవ్వకూడదు. ప్రైవేటు సంస్థలకు మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు 2జీ స్పెక్ట్రమ్, ఇతర కేసుల్లో అనేక సార్లు ఆదేశాలు జారీ చేసింది. కానీ టీసీఎస్‌కు అతి చవక ధరకు ప్రభుత్వ భూమిని ఇవ్వడం సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుంది.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

టాపర్లకు కలెక్టర్ అభినందన



టెన్త్ టాపర్లతో కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో డీఈవో అప్పారావునాయుడు

తుమ్మపాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన తొమ్మిదిమంది విద్యార్థులను కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. గురువారం తన చాంబర్‌కు పిలిపించి ప్రత్యేక ప్రశంసలతోపాటు మెమెంటోలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా నుంచి తొమ్మిదిమంది 590 పైగా మార్కులను సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు ఎటువంటి ఇబ్బందులు, ఆరోపణలు లేకుండా విజయవంతంగా నిర్వహించడంతోపాటు రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం సాధించడానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడును, ప్రధాన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. కలెక్టర్ అభినందనలు అందుకున్న వారిలో పరవాడ మండలం పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వెంకట జయ (595), అదే స్కూలుకు చెందిన పల్లా అనుష్క (592), అచ్యుతాపురం ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థి కోసూరు మౌనిక (593), పరవాడ మండలం తానాం బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని వాసిరెడ్డి వెంకటలక్ష్మి (592) తదితరులున్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

- ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి: డీఆర్వో

తుమ్మపాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) గోదామును జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు తనిఖీ చేశారు. మాసంతపు తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో గల ఈవీఎం గోదామును గురువారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి అక్కడ భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. అంతకుముందు తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా గురించి ప్రతి నెల రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాలను నాణ్యంగా తయారు చేసేందుకు, మెరుగుపరిచేందుకు మరింత మంది బూత్ స్థాయి అధికారులు, ఎలక్టోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసునాయుడు, ఉప తహసీల్దార్ రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.తాతయ్య బాబు, పి.నాగేశ్వరరావు, టి.షణ్ముఖ, కె.హరినాథబాబు, జి.శ్రీరామ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహానేతకు ఎన్నాళ్లీ ముసుగు



లాలం కొత్తూరులో ముసుగులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

కోటవురట్ల: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలం కొత్తూరులో రాష్ట్ర రహదారి పక్కనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వేసిన ముసుగు ఇంకా తొలగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తున్నా ముసుగు మాత్రం తొలగించలేదు. దీంతో స్థానికులు ఔరా అంటూ విస్తుపోతున్నారు. ముసుగులు ఇంకా తొలగించకపోవడం శోచనీయమని వైఎస్ అభిమానులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ముసుగు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధం

మురళీనగర్: పాలిసెట్ హాల్ టికెట్లు సిద్ధంగా ఉన్నాయని విశాఖ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసిన వారు పాలిసెట్.ఏపీ.ఎస్‌బీసీ.ఇన్ వెబ్ సైట్‌లో నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాలిసెట్‌కు జిల్లాలో సుమారు 14,000 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈనెల 30 తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు రావికమతం విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డ్ అందుకుంటున్న దివ్యాంగ విద్యార్థి బాల సరస్వతి

రావికమతం: విజయవాడలోని హిల్ పారడైజ్ స్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్–2025 క్రీడా పోటీల్లో రావికమతం మండలం కేబీపీ అగ్రహారానికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థిని నక్కరాజు బాల సరస్వతి ప్రతిభ కనబరిచింది. 'బోసి'పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బాల సర్వసతికి రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రనాథ్, విద్య కో–ఆర్డినేటర్ అన్నపూర్ణ, స్పెషల్ ఒలింపిక్ భారత కమిటీ జాతీయ స్థాయి క్రీడా నిపుణుడు రాజశేఖర్ ప్రశంసా పత్రం, వెండి పతకం అందజేశారు. ఈమె జూలై నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్ భారత క్రీడా పోటీల్లో పాల్గొంటుందని స్పెషల్ ఎడ్యుకేటరు, మేటివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మీనాయుడు తెలిపారు. అనకాపల్లి జిల్లా నుంచి ఐదుగురు పిల్లలు పాల్గొని పతకాలు సాధించేలా తీర్చిదిద్దిన కోచ్‌లు మహాలక్ష్మీనాయుడు, పోలిరాజును జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఉన్నత అధికారులు అభినందించారు.



ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు



నృత్యాలను తిలకిస్తున్న విద్యార్థులు

ఏయూలో శతాబ్ది ఉత్సవాల జోష్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో శతాబ్ది ఉత్సవాల జోష్ కనిపిస్తోంది. ఈ నెల 26న వర్సిటీ వందో ఏట అడుగుపెట్టనున్న సందర్భంగా ఏడాది పొడవునా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందులో భాగంగా వర్సిటీ పరిపాలన భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో క్యాంపస్‌లో శతాబ్ది ఉత్సవాల శోభ వెల్లివిరుస్తోంది. ఈ వేడుకల కోసం క్యాంపస్ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు. గురువారం సాయంత్రం కాలేజీ విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులందరూ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఇస్తూ.. నృత్యాలతో అలరించారు.



ఏడాదిలోపే ఇంతటి వ్యతిరేకతా?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే అధికారం
- 11 నెలల మేయర్ పదవీ కాలం కోసం కూటమి కుట్రలు
- 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి రాజకీయాలు చూడలేదు
- ఎన్ని ప్రలోభాలు పెట్టినా నిబద్ధతతో ఉన్న కార్పొరేటర్లకు అభినందన
- డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని బహిష్కరిస్తున్నాం..
- శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాఖ సిటీ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది తిరగక ముందే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీయే అని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్ర దాడిని రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. వారి కుటుంబాలకు ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షించారు.

గెలుపోటములు సహజం

రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఆయన పేర్కొన్నారు. విశాఖ మేయర్ పీఠం కోసం కూటమి నేతలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 11 నెలల అధికారం కోసం కూటమి నేతలు అవిశ్వాసం పెట్టి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ప్రలోభపెట్టి, లొంగకపోతే ఆర్థిక మూలలను దెబ్బతీస్తామని బెదిరించారని వెల్లడించారు. తమ కార్పొరేటర్ల కోసం రూ.25 లక్షలు ఖర్చు చేసి ప్రత్యేక విమానంలో కేరళకు వెళ్లడం పరాకాష్ట అన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను ఎన్ని ఇబ్బందులు, ప్రలోభాలకు గురి చేసినా మెజార్టీ సభ్యులు పార్టీలోనే ఉన్నారని వారిని అభినందించారు. ఒక్క ఓటుతో ఓడిపోయినా ఓటమే అని, ఇది ఒక గుణపాఠంగా తీసుకొని అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాబోయే విజయానికి ఇదే పునాదిరాయిగా అభివరించారు. ఈ 11 నెలల కాలంలో కూటమి కార్పొరేటర్లు నగరాభివృద్ధి ఎలా చేస్తారో ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఇదే విధంగా ఈ నెల 26న జరగనున్న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఇది మంచి సంప్రదాయం కాదు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో జరిగిన దాడులు, ఘటనలను ఆయన ఖండించారు. తన 35 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత దారుణమైన పాలన, ప్రవర్తన చూడలేదని చెప్పారు. ప్రత్యర్థి పార్టీ నేతలపైనే కాకుండా వారి ఆస్తులు, ఆర్థిక మూలలపై దెబ్బకొట్టడం మంచి సంప్రదాయం కాదని హితవు పలికారు. తానెప్పుడూ ఇటువంటి రాజకీయాలు చూడలేదు, చేయలేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, తిప్పల దేవన్‌రెడ్డి, మలసాల భరత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తైనాల విజయ్‌కుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

చందనోత్సవం టికెట్ల విక్రయాలు ప్రారంభం

- ఒక ఆధార్‌పై 4 టికెట్లు మాత్రమే జారీ
- ఉదయం 5లోపే ప్రొటోకాల్ వీఐపీల దర్శనాలు పూర్తి



చందనోత్సవం టికెట్లను భక్తులకు అందిస్తున్న దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు

సింహాచలం: సింహగిరిపై చందనోత్సవం టిక్కెట్ల విక్రయాలు గురువారం ప్రారంభమయ్యాయి. పాత పీఆర్వో కార్యాలయంలో ఉదయం 7 నుంచి రూ.300, రూ.వెయ్యి టికెట్ల విక్రయాలను ప్రారంభించి, దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు చేతుల మీదుగా భక్తులకు అందించారు. ఒక ఆధార్ నెంబరుతో నాలుగు టిక్కెట్లు మాత్రమే జారీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఈవో మాట్లాడుతూ రూ.300, రూ.వెయ్యి టికెట్లను ఉదయం 3.30 నుంచి రాత్రి 7 వరకు పలు టైం స్లాట్‌లుగా విభజించి జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న తెల్లవారుజాము 3 గంటలకు దేవస్థానం అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు తొలిదర్శనం కాగానే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఉదయం 5లోపు ప్రొటోకాల్ వీఐపీల దర్శనాలు పూర్తిచేస్తామన్నారు. వారికి మాత్రమే అంతరాలయ దర్శనం కల్పిస్తామన్నారు. ఆ తర్వాత వచ్చిన వారికి నీలాద్రిగుమ్మం వద్ద నుంచే దర్శనం ఉంటుందన్నారు. ప్రొటోకాల్ వీఐపీలను రెండు కేటగిరీలుగా విభజించినట్లు పేర్కొన్నారు. దేవస్థానం చైర్మన్, సీఎం, మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు ఉచితంగానే దర్శనం కల్పిస్తామన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా రూ.1500 ప్రొటోకాల్ టికెట్లు తీసుకోవాల్సిందేనని, వారితో పాటు ఆరుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఈ టికెట్లను ఎవరెవరికి జారీ చేయాలో జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. ఈసారి నీలాద్రి గుమ్మం వద్ద ఆరు క్యూలైన్లలోనే భక్తులు వెళ్లి స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

బ్యాంకుల్లో జారీ కానీ టికెట్లు

సింహాచలం: ఏడాదిలో ఒక్క రోజు, అది కూడా కొన్ని గంటలు మాత్రమే వరాహ లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనం లభిస్తుంది. దీని టికెట్ల కోసం లక్షలాది మంది భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఈ ఏడాది వాళ్ల ఆశలపై ఆదిలోనే కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. చందనోత్సవానికి రూ.300, రూ.వెయ్యి టిక్కట్ల విక్రయాలను గురువారం నుంచి ప్రారంభిస్తామని ప్రకటించారు. సింహాచలం కొండపైన, సింహాచలంలోనే ఉన్న యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకులతో పాటు నగరంలోని అక్కయ్యపాలెం, కేజీహెచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ల్లోను, బిర్లా జంక్షన్, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం బ్రాంచ్) ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో టిక్కెట్లు లభిస్తాయని ప్రకటించారు. తీరా చూస్తే సింహగిరిపైన, సింహాచలంలోని బ్రాంచుల్లో తప్ప నగరంలోని మరే బ్రాంచుల్లోనూ టిక్కెట్ల విక్రయాలు గురువారం జరగలేదని తెలిసింది. ఆయా బ్రాంచ్‌ల వద్ద టిక్కెట్ల కోసం వెళ్లినవారికి నిరాశే ఎదురైంది. ఇందుకు కారణం టిక్కెట్లను ఆయా బ్రాంచిలకు అందించకపోవడమేనని సమాచారం. గురువారం సాయంత్రానికి బ్యాంక్ శాఖలకు టిక్కెట్లు పంపించే ఏర్పాట్లు చేసినట్టు తెలిసింది. ఆన్‌లైన్‌లో కూడా టిక్కెట్లు తీసుకునేందుకు పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అందరికీ నచ్చేలా 'సారంగపాణి జాతకం'

హీరో ప్రియదర్శి



మాట్లాడుతున్న హీరో ప్రియదర్శి, హీరోయిన్ రూపా, దర్శకుడు ఇంద్రగంటి

దాబాగార్డెన్స్: 'సారంగపాణి జాతకం'లో తాను చేసిన పాత్ర, ఈ చిత్రం అందరికీ నచ్చుతుందని హీరో ప్రియదర్శి తెలిపారు. ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం రిలీజ్ కానున్న నేపథ్యంలో ఆ చిత్ర యూనిట్ గురువారం నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా జగదాంబ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో హీరో ప్రియదర్శి మాట్లాడారు. తాను నటించిన మల్లేశం, బలగం, కోర్ట్ సినిమా తరహా భావోద్వేగాలతో సాగే ఓ సాధారణ వ్యక్తి కథే సారంగపాణి జాతకం అన్నారు. ఇంద్రగంటితో ఒక ఫొటో దిగితే చాలనుకునే వాడినని.. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో నటించడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రం కోసం ఇంద్రగంటే ఎక్కువ కష్టపడ్డారన్నారు. ఈ సినిమాలో ఆంధ్ర యాసలో డైలాగ్‌లు చెప్పినట్లు వివరించారు. హీరోయిన్ మాట్లాడుతూ అందర్నీ ఈ సినిమా ఆకట్టుకుంటుందన్నారు. ఆద్యంతం హాస్యంతో పాటు ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుందన్నారు.

దర్శకుడు ఇంద్రగంటి మాట్లాడుతూ విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. అష్టాచమ్మా చిత్రం విశాఖలో షూటింగ్ చేసి.. నానీని హీరోగా పరిచయం చేసినట్లు చెప్పారు. మంచి కథతో అందరూ ఇష్టపడే హాస్యంతో రూపొందించిన ఈ సినిమాను ఆదరించాలని ప్రేక్షకులను కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తుమ్మపాల: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటామన్న ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద గురువారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం(సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు బోర్డు పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, మరణించిన కార్మికులకు బీమా పరిహార చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.అప్పలనాయుడు సిహెచ్.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర, కొండబాబు, నర్సింగరావు, అప్పలరమణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూలస్తంభాలు



ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకరదేవిని సత్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



సర్పంచ్ బుల్లెమ్మను సత్కరిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధ్ర ప్రసాద్

బీచ్‌రోడ్డు (విశాఖ): గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే మూలస్తంభాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకంగా మారిందని, ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన అధికారులుగా పంచాయతీరాజ్ ఉద్యోగులు గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో స్వయం సమృద్ధికి సర్పంచులు, వార్డు సెక్రటరీలు సేవలు అందించాలని సూచించారు. స్వయం శాసనం–గ్రామాల బలోపేతం అనే దృక్పథంతో పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ప్రతి గ్రామం అభివృద్ధిలో ముందుండేందుకు పంచాయతీ ప్రతినిధులు నిధుల సమీకరణపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం విశేష సేవలందించి మోడల్‌గా నిలిచిన సర్పంచ్‌లకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.సత్యవతి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: ఉత్తమ సర్పంచ్‌లకు పురస్కారాలు లభించాయి. మండలంలోని మెలుపాక జగన్నాథపురం సర్పంచ్ కర్రెడ్ల బుల్లెమ్మ ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా కార్యాలయంలో కలెక్టర్ హరేంద్రి ప్రసాద్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుల్లెమ్మ మాట్లాడుతూ జగన్నాథపురం గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ్ కృష్ణన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

డీఎల్‌పురం సర్పంచ్‌కు అవార్డు



పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి అవార్డు అందుకుంటున్న డీఎల్‌పురం సర్పంచ్ రామకృష్ణ

నక్కపల్లి: డీఎల్‌పురం పంచాయతీకి చైల్డ్ విలేజ్ థీమ్‌లో జాతీయ పంచాయతీ దినోత్సవ అవార్డు లభించింది. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో సదుపాయలు కల్పించడం, పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం చైల్డ్ ఫ్రెండ్లీ థీమ్ అవార్డుకు ఎంపిక చేసింది. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విజయవాడలో సీకే కన్వెన్షన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, కార్యదర్శి నర్సింగరావు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



మృతుడు అప్పలకొండ

నక్కపల్లి: దేవవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దమ్ము అప్పలకొండ(41)బుధవారం గ్రామంలో తాటాకులు నరికేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తూ జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతి చెందిన వెంకటరమణ

కె.కోటపాడు : చౌడువాడ శివారు మల్లంపాలెం గ్రామానికి చెందిన వంటాకు వెంకటరమణ(50) విద్యుత్ షాక్‌కు గురై గురువారం సాయంత్రం మృతి చెందారు. తన పొలంలోని మోటారు తిరగడం లేదని సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి సెక్షన్ బాక్స్ వద్ద ఉన్న ఫీజులను చెక్ చేస్తుండగా వెంకటరమణ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ఆయనను చౌడువాడ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కె.కోటపాడు సీహెచ్‌సీకి 108 వాహనంలో తరలిస్తుండగా.. మార్గం మధ్యలో ఆయన మృతిచెందాడు. మృతుడు భార్య సత్యవతి గురువారం రాత్రి కె.కోటపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును నమోదు చేసి ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ దర్యాప్తు చేపట్టారు. అందరితోను మంచిగా ఉండే వెంకటరమణ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

14 ఏళ్లుగా పరారీలో ఉన్న గంజాయి నిందితుడు అరెస్ట్



పంగలి దేవన్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

నాతవరం: కోర్టు వాయిదాలకు రాకుండా 14 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న గంజాయి నిందితుడిని ఎట్టకేలకు అరెస్ట్ చేశామని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. గురువారం నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజుతో కలిసి ఆమె మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం మదురై జిల్లా మీనంబలంపురం గ్రామానికి చెందిన పంగలి దేవన్ గంజాయి రవాణా చేస్తుండగా నాతవరం పోలీసులకు 2011లో పట్టుబడ్డాడన్నారు. ఆయన నుంచి 450 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకుని అప్పట్లో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన అప్పటి నుంచి వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. నిందితుడి ఆచూకీ కోసం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేక దృష్టి సారించారన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో సంచరిస్తున్న నిందితుడిని కేడీ పేట ఏఎస్ఐ వై.వెంకటరావు, నాతవరం పోలీసు కానిస్టేబుల్ కె.లోవరాజు ఈ నెల 23న చాకచక్యంగా పట్టుకున్నారన్నారు. గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. ఎళ్ల తరబడి తప్పించుకుని తిరుగుతున్న దేవన్‌ను పట్టుకున్న వెంకటరావు, లోవరాజులను ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించారని సీఐ తెలిపారు.

తోటలో తమిళనాడు వాసి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం ఉద్యోగి నర్సింగరావు, ఎస్ఐ రామకృష్ణ (ఇన్‌సెట్) మృతుడు కనగరాజ్ రమేష్(ఫైల్)

రోలుగుంట: తమిళనాడు రాష్ట్రం నుంచి కనగరాజ్ రమేష్(42) వడ్డిప నుంచి అర్ల వెళ్లే అడవి మార్గంలోని ఓ ఊప్లిస్ తోటలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి గురువారం వెళ్లి పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు మేనల్లుడు దయానిధి మండలంలో బొప్పన గ్లోబల్ అండ్ సివిల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దీంతో తనకు కూడా డ్రైవర్ జాబ్ చూడమని చెప్పి దయానిధి వద్దకు రమేష్ వచ్చాడు. ఆరోగ్యం సరిగా ఉండడం లేదని, వెనక్కి వెళ్లిపోవాలని చెప్పి మృతుడికి దయానిధి కొంత డబ్బు ఇచ్చాడని ఎస్ఐ తెలిపారు. ఆ డబ్బులతో కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలోనే పూటుగా మద్యం తాగుతూ తిరిగాడని, దీనికి తోడు సరైన ఆహారం అందకపోవడంతో తోటలో చనిపోయినట్టు భావిస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు. అనకాపల్లి నుంచి క్లూస్ టీంను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నామన్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

మునగపాక: యాదగిరిపాలెంలో పాత కక్షలతో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. యాదగిరిపాలేనికి చెందిన కరణం నాగేశ్వరరావుకు అదే గ్రామానికి చెందిన యాదగిరి గోవింద్, నాగప్పారావు, రౌతు చిరంజీవి, నాగ గణేష్ కుటుంబాల మధ్య తగాదాలు ఉన్నాయి. దీనిలో భాగంగా పాత కక్షలను మనస్సులో పెట్టుకుని నాగేశ్వరరావుతో బుధవారం రాత్రి జరిగిన వివాహ కార్యక్రమంలో ప్రత్యర్థి వర్గం గొడవకు దిగింది. ఈ గొడవలో నాగేశ్వరరావు తలపై ఇటుకతో కొట్టి గాయపరిచారు. నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

తొలి విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 30న నిజరూప దర్శనం అనంతరం ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించాల్సిన మూడు మణుగుల పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఏకాదశిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. నోటికి వస్త్రం చుట్టుకుని తొలిచందనాన్ని అరగదీశారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు చందనాన్ని అరగదీశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు కారణంగా నరసింగబిల్లితోపాటు జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, త్రిపురవానిపాలెం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, సోమవరం, ఏఎస్ పేట, తాళ్లపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, పరవాడపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గంటవానిపాలెం, పేరంటాలపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి తమ సిబ్బందికి సహకరించాలని వినియోగదారులను కోరారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా ఆరాధన



సత్యసాయి బాబా సమాధి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా బాబా సమాధి వద్ద జ్యోతి ప్రజ్వలన, పూజా కార్యక్రమం నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులతో ఓంకారం, గణేష్ ప్రార్థన, సాయి గ్రాయిత్రి పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ కేవీ మహేశ్వరావు, యల్లపు మాధవరావు, బుద్ద సుబ్రహ్మణ్యస్వామి, సత్యసాయి మందిరం సంస్థ చైర్మన్ మల్ల సత్యసాయి, ఎం బాలు తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయలు సాధారణ ధరకు అమ్మకాలు సాగాయి. కిలో టమాటా రూ.20, ఉల్లి, బెండకాయ, వంకాయ, దొండకాయ, క్యాబేజీ, బంగాళదుంప రూ.30, బీట్రూట్, క్యారెట్, బరబాటి రూ.40, బీరకాయ, కాకరకాయ రూ.60కి విక్రయాలు సాగాయి.

ఉగ్రదాడిలో మృతులకు కొవ్వొత్తులతో నివాళి



నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: కశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని హ్యాపీ కిడ్స్ పాఠశాల సమ్మర్ క్యాంప్ విద్యార్థులు కొవ్వొత్తుల వెలిగించి నివాళులర్పించారు. స్కూల్ కరస్పాండెంట్ ఎస్ గిరీష్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో ముగ్గురు తెలుగువారు మరణించడం బాధాకరమన్నారు. ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 1,296 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠధర	గరిష్ఠధర
మొదటి రకం	3,970	4,610
రెండో రకం	3,530	4,200
మూడో రకం	3,060	3,490

అనకాపల్లి సినిమాలు

రాజా : జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : సారంగపాణి జాతకం
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : పాతం
శ్రీసత్య : సోదరా
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు , బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 345 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 293 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అడ్మిషన్ల టార్గెట్



- ఇంటర్‌లో ప్రవేశాల కోసం అధ్యాపకుల పాట్లు
- విద్యార్థుల తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణలు
- 10 నుంచి 15 మంది విద్యార్థులను చేర్పించాలని ఒత్తిళ్లు
- రోజూ తెల్లవారు ముందే గ్రామాల్లో పర్యటనలు
- కళాశాలల యాజమాన్యాల వేధింపులు

అనకాపల్లి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో జిల్లా, పట్టణ టాపర్లు మా కళాశాలలకు చెందిన విద్యార్థులే నంటూ... అధ్యాపకులు పది పాసైన విద్యార్థులను వలేస్తున్నారు. ఈ మేరకు పట్టణ, మండలంలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల గృహాలకు తెల్లవారకముందే చేరుకుని మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించండి.. అలాంటి ఫలితాలే వస్తాయి అంటూ బుర్రలు తింటున్నారు. మేము ఒక ప్రైవేట్ కళాశాల నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ అబ్బాయి, అమ్మాయిని మా కళాశాలలో చేర్పించండి ఇప్పుడే రిజిస్టర్ చేయించుకోన్నట్లయితే 10 నుంచి 20 శాత ఫీజులో రాయితీ ఇస్తామంటున్నారు. ముందుగా రూ.2 వేలు కట్టి మీపేరు నమోదు చేసుకుంటే, సీటు రిజర్వ్ చేసి పెడతాం. లేకపోతే సీటు దొరకడం కష్టం, మీరు ఓకే అంటే మా సిబ్బంది మీ వద్దకే వచ్చి పూర్తి వివరాలు తీసుకుంటామంటూ కార్పొరేట్ సంస్థలు చెప్పుతున్నాయి. కొంతమంది కళాశాలల అధ్యాపకులు ఇళ్ల వద్దకే వెళ్లి మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించండి ఫీజులు తగ్గిస్తాం.. అంటూ ఒత్తిడి చేసున్నారు.

జిల్లా టాపర్‌గా తీర్చిదిద్దుతామని ఎర...

అనకాపల్లి పట్టణంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు 14 ఉన్నాయి. విద్యార్థులకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో కళాశాలల యాజమాన్యాలు చర్యలు చేపట్టడం లేదు. కొన్ని కళాశాలల్లో ఆట స్థలాలు లేనప్పటికీ ఉన్నట్లుగా రికార్డులో చూపించి, విద్యార్థులను చేర్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగిస్తారు. పదో తరగతి ఫలితాలు తర్వాత విద్యార్థుల ఫలితాలను కళాశాలల అధ్యాపకులు దృష్టిలో పెట్టుకుని మీ విద్యార్థి మంచి మార్కులు వచ్చాయి.. కాబట్టి మా కళాశాలలో చేర్పించినట్లయితే ఫీజులో రాయితీ ఇవ్వడమే కాకుండా జిల్లా టాపర్‌గా తీర్చిదిద్దే బాధ్యత మేము తీసుకుంటామని నమ్మబలుకుతున్నాయి. నిత్యం విద్యార్థుల తల్లిదండ్రులు చుట్టూ అధ్యాపకులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ తరగతులు 7వ తేదీ నుంచి ప్రారంభించడంతో కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. విద్యార్థుల వేట కోసం ముమ్మరంగా జల్లెడ పడుతున్నారు. పోటీ తీవ్రంగా ఉండడంతో కళాశాలల యాజమాన్యాలు సిబ్బందిపై ఒత్తిడి చేసి, విద్యార్థులను చేర్పించే బాధ్యత మీదేనంటూ ఆదేశాలు జారీ చేస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్తూ ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ ర్యాంక్‌లు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఎంపికయ్యే స్థాయిలో మా విద్యా బోధన ఉంటుందంటూ చెప్పుకొస్తూ అడ్మిషన్లు చేయిస్తున్నారు.

అధ్యాపకుల కష్టాలు....

తెల్లవారక ముందే పట్టణ, గ్రామాలకు అధ్యాపకులు మూకుమ్మడిగా చేరుకుని పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులకు వద్దకు చేరుకుని ఒప్పించి మరీ అడ్మిషన్లు చేయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీస మౌలిక సదుపాయాలు, క్రీడా మైదానాలు, తరగతి గదులతో **పాటు విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించ**డంలో కళాశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవడం లేదు. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఆయా సంస్థల యాజమాన్యాలు చెప్పినట్లు అడ్మిషన్లు కోసం సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణనాతీతం..

కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలు అరికట్టాలి



విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆశలు రేపే ప్రకటనలు, ప్రచారాలతో బురిడీ కొట్టించే కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఆగడాలు అరికట్టాలి. ఆ కోర్స్, ఈ కోర్సు అని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మభ్యపెడుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాలల్లో చేర్చే వరకూ ఒక మాట.. చేర్పిన తర్వాత మరో మాటా చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

– వియ్యపురాజు, ఏఐవైఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, అనకాపల్లి

ఫీజులు చూస్తే భయమేస్తోంది



ఈ ఏడాది మా అబ్బాయి పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాడు. ఇప్పటికి మా ఇంటికి ఐదు ప్రైవేట్ కళాశాలల నుంచి అధ్యాపకులు వచ్చారు. నా కుమారుడిని కళాశాలలో చేర్పించాలని కోరారు. ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో నిర్ణయం తీసుకుని చేర్పిస్తామని చెప్పాను. ఫీజు చూసి భయం పట్టుకుంది. ఈ విషయంలో ప్రభుత్వం ఒక చార్టును ప్రకటించినట్లయితే బాగుంటుంది.

– పెంటకోట శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ విద్యార్థి తండ్రి, గవరపాలెం

పట్టపగలే విద్యుత్ వెలుగులు



పూల్‌బాగ్ రోడ్డులో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. అధికారుల నిర్లక్షానికి ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరం దీపాలు వెలుగుతున్నా సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంతరం విద్యుత్ ఆదాకు సోలార్ వంటి వ్యవస్థను ప్రోత్సహిస్తుంటే, ఇక్కడ మాత్రం వృథా చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్టు



నిందితుడ్ని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామ శివారులో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అనకాపల్లి ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై. లక్ష్మీనాయుడు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసి సారా విక్రయిస్తున్న కరక రాజు(38)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఎస్ఐలు ఎస్వీ నారాయణ, కేఎస్ గణేష్, సిబ్బంది ఎంవీఎస్ రమేష్, శ్రీను పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాయుడు

అనకాపల్లి: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ నుంచి ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు వరకూ ఈనెల 26న మధ్యాహ్నం 3 గంటలు ప్రారంభమయ్యే హనుమాన్ శోభాయాత్రకు ఏర్పాట్లు చేస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక నర్సింగరావుపేట వెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఈ యాత్రను జంగారెడ్డిగూడెంకు చెందిన అనందస్వామిజీ ప్రారంభిస్తారన్నారు. స్థానిక శారదానది ఒడ్డున అదే రోజు రాత్రి 7 గంటలకు గంగా హారతి ఇస్తామన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాలని, హిందువులపై దాడులను తక్షణమే ఖండించాలని కోరారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్ష మంది శోభాయాత్రలో పాల్గొంటారన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు జరుగుతాయన్నారు. గతంలో విశాఖలో ఈ యాత్ర అత్యంత వైభవంగా జరిగిందన్నారు. భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సనాతన ధర్మాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు శ్రీకాకహస్తి, సాయి, విల్లూరి శ్రీనివాసరావు, సుదురిపాటి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలను పెంచాలి

- ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా



డిపో ఎదుట ధర్నా చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

అనకాపల్లి టౌన్: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్ల జీతాలను పెంచాలని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్, హెయిర్ బాక్స్ డ్రైవర్ల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక డిపో ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసి ఆరు నెలలు అవుతున్నా జీతాలు పెంచక పోవడం అన్యాయమన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ అమలు చేయాలని, యూనిఫాం అలెవెన్స్ ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని డ్రైవర్లపై వేధింపులు ఆపాలన్నారు. పర్మినెంట్ డ్రైవర్లతో సమానంగా పనిచేస్తున్నా, అద్దె బస్సు డ్రైవర్లకు వేతనాలు పెంచడం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అద్దె బస్సు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, డిపో కార్యదర్శి ఎంపీ నాయడు, వై శివ, డీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడవివరం హైస్కూల్ టాపర్లకు ఆర్జేడీ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో టాపర్లుగా నిలిచిన విష్ణువర్ధన్ సాయి(588), కవిత(574)లను పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ తన కార్యాలయంలో గురువారం పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అదించడం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించగలమని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కఠినమైన శ్రమతో ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్యుతాపురం రూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సీఆర్టీ దేవరాయల్ గురువారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా www.rguktn.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మే 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో నూజివీడు, ఆర్‌కే వ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాలు ఉన్నాయన్నారు.

నష్టపరిహారం చెల్లింపుల్లో అన్యాయం

- నిర్వాసితుల తరపున వైఎస్సార్ సీపీ పోరాటం

నక్కపల్లి: ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి విమర్శించారు. గురువారం ఆయన ఏపీఐఐసీ వారు భూములు సేకరించిన గ్రామాల్లో రైతులు, నిర్వాసితులు, మత్స్యకారులతో కలసి పర్యటించారు. ఏపీఐఐసీ వారు చేపట్టిన పనులు పరిశీలించారు. నష్టపరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వ తీరును బాధిత రైతులు మొరపెట్టుకున్నారు. నష్టపరిహారం చెల్లించకుండా భూముల్లో పనులు ప్రారంభించారని, అడ్డుకుంటే పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాజయ్యపేట, డీఎల్‌పురం, వేంపాడు, చందనాడ, అమలాపురం తదితర గ్రామాల్లో భూములు సేకరించిందన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని ఇచ్చిన హామీని విస్మరించి రైతులను మోసం చేసిందన్నారు. తాజాగా సుప్రీం కోర్టు తీర్పును కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఈ గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం కాదన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో నిర్వాసితులకు, చేతి వృత్తులవారికి, ఈ ప్రాంత యువతకు ఉద్యోగాల కల్పించాలన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు తక్షణమే నక్కపల్లిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఐదు సెంట్ల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.15 లక్షలు, మేజర్లకు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పోలీసు కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. తక్షణమే నష్టపరిహారం చెల్లింపులను పూర్తి చేయాలని, డీఫారం, సాగుదారులకు పరిహారం చెల్లించకపోతే వైఎస్సార్ సీపీ తరపున ఆందోళన ప్రారంభిస్తామన్నారు. చినతీనార్ల సర్పంచ్ మునలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరిపల్లి నాగేశు, కొర్లయ్య, అప్పలరాజు, పైడితల్లి, నూకరాజు పిక్కి రాము తదితరులు పాల్గొన్నారు.

55వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 55వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా డిపోలో సమస్యలపై ప్లకార్డుల ప్రదర్శన చేపట్టారు. డిపో సెక్రటరీ కేఎస్ఎన్ రమేష్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు 1-2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎస్ రావు, డిపో చైర్మన్ కేఎం రావు, వీఆర్ఎస్ రావు, ఏ అన్నపూర్ణ, పీవీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ

కశింకోట: సోమవరం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.96 లక్షలతో చేపట్టనున్న కాలువ నిర్మాణ పనులకు మాజీ సర్పంచ్, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు గురువారం భూమి పూజ చేసి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టామని, దీన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

మండల టెన్త్ టాపర్‌కు సత్కారం

కశింకోట: మండలంలోని సోమవరంలో మండల టెన్త్ టాపర్ చేబ్రోలు దీపికను రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు గురువారం దుశ్శాలువా కప్పి సత్కరించారు. తాళ్లపాలెం భార్గవి విద్యా మందిర్‌లో చదివి టెన్త్‌లో అత్యధికంగా 594 మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో పోలీసులు

ఎస్.రాయవరం: వమ్మవరం శివారులో పేకాడుతుండగా ఐదుగురు పట్టుబడినట్టు ఎస్ఐ విభీషణ రావు తెలిపారు. స్థానికులు సమాచారం మేరకు గురువారం తమ సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

చందనం అరగదీత సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ



సిబ్బందికి పంచెలు అందిస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: సింహగిరిపై గురువారం నుంచి ప్రారంభమైన తొలి విడత చందనం అరగదీతను పురస్కరించుకుని అరగదీతలో పాల్గొన్న సిబ్బందికి దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు నూతన వస్త్రాలు అందించారు. ఆలయ బేడా మండపంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి టౌన్: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1933లో రాష్ట్రపతి ఆమోదం పొంది తదుపరి ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ని ప్రాధాన్యం వివరిస్తూ మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఎంఈవో కేఎస్ఎన్ మూర్తి, హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావు, ఏపీవో ఎం. శ్రీనివాసరావు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేల బావిలో పడి మేకల కాపరి మృతి



మృతుడు నంబారు చినఅప్పారావు(ఫైల్)

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నేల బావిలో పడి మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నంబారు చిన అప్పారావు(58) బుధవారం మేకలు, గొర్రెలను గ్రామానికి దూరంగా మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం అయ్యేసరికి మేకలు ఇంటికి చేరుకున్నాయి కానీ.. వెంట వెళ్లిన కాపరి ఇంటికి చేరుకోలేదు. దీంతో గ్రామస్తులు చుట్టు పక్కల గాలించినా అచూకీ కనిపించలేదు. ఊరికి దూరంగా ఉన్న నేల బావి వద్ద గురువారం సాయంత్రం చెప్పులు కనబడటంతో బావిలో వెతికారు. అందులోనే అప్పారావు మృతదేహం లభ్యమయ్యింది. మృతుడికి భార్య పైడమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు లోవరాజు ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



ఆలయ సూపరింటెండెంట్‌కు నగదు అందిస్తున్న దాత పైడితల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం అడవివరానికి చెందిన లోగిశ వరాహనరసింహం, పైడితల్లి దంపతులు లక్షా ఒక్క రూపాయి విరాళమిచ్చారు. ఉదయం ఆలయానికి వచ్చిన పైడితల్లి సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ లక్ష్యం

మునగపాక: బాలికలపై వేధింపులతోపాటు, బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్ర స్థాయి కార్యకర్త కేఎల్‌వీ రమ్య కోరారు. మండలంలోని పాటిపల్లి, నారాయుడుపాలెం గ్రామాల్లో గురువారం ఆమె బాలల సంరక్షణకు సంబంధించి 11 మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టాలు గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. సర్పంచ్‌లు ఆడారి కృష్ణవేణి, కోరుకొండ వెంకటి, పంచాయతీ కార్యదర్శులు రాజబాబు, కేటీ రావు, వీఆర్వో సింహాచలం, ఏఎన్ఎం సుజాత, మహిళా పోలీసు ఎస్‌కేఎం బేగం పాల్గొన్నారు.